కొవ్వాడ ఉగ్రరూపం



చిట్యాలలో ముంపులో ఉన్న వరి పొలాలు



వెంకటాయపాలెంలో చెరువులా మారిన పొలాలు

- ఉధృతికి నీటమునిగిన 1,200 ఎకరాలు
- చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి రైతులకు తీవ్ర నష్టం
- బ్రిడ్జి నిర్మించాలని వినతి

గోపాలపురం: కొవ్వాడ ఈ పేరు వినగానే నాలుగు నియోజకవర్గాల రైతులు ఉలిక్కిపడతారు. దీంతో ఖరీఫ్ సీజన్‌లో తుపాన్ల ప్రభావంతో ఈ కాలువ వరద ఉగ్రరూపం దాల్చితే పంట పొలాలు నీట మునుగుతాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హయాంలో ఈ కాలువ ఆధునీకరణ పనులు అటకెక్కాయి. దీంతో రైతులు నష్టాలపాలవడం పరిపాటి. జిల్లాలోని తాళ్లపూడి, కొవ్వూరు, గోపాలపురం, చాగల్లు, నిడదవోలు మండలాలు మీదుగా సుమారు 80 కి.మీ మేర ఈ కాలువ ప్రవహిస్తోంది. పోలవరం నుంచి వరద నీరు పట్టిసీమ వద్ద నిర్మించిన అవుట్‌ఫాల్ స్లూయిస్ నుంచి గోదావరిలోకి కొంత వరద కలుస్తోంది. మిగిలింది స్థానిక వాగులతో కలుస్తుంది. తాళ్లపూడి మండలం కాపవరం మీదుగా చాగల్లు మరో వైపు దేవరపల్లి, గోపాలపురం మండలాల పరిధిలోని చిట్యాల, వెంకటాయపాలెం తదితర ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు కూడా దీని మీదుగానే నిడదవోలు పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో కలుస్తోంది. గుర్రపు డెక్క, గడ్డి ఏపుగా పెరగడంతో వరదనీరు ముందుకు పారే పరిస్థితి లేదు.

నీట మునిగిన పంట

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు కొవ్వాడ కాలువ ఉధృతికి గోపాలపురం మండలం చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లో సుమారు 1,200 ఎకరాల్లోని వరి పంట నీటమునిగింది. గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పాటు కొవ్వాడ రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన అదనపు నీటి ప్రవాహం వల్ల ఏటా తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొవ్వాడ రిజర్వాయర్ నుంచి విడుదలైన నీటిని సప్లై చానల్ కాలువ తవ్వించి ఆ నీటిని పోలవరం వద్ద గోదావరి నదిలో కలిసే విధంగా కాలువ నిర్మాణం చేపట్టారు. కొవ్వాడ రిజర్వాయర్ నుంచి విడుదల చేస్తున్న నీటికి కొయ్యలగూడెం, గోపాలపురం మండలంలో కురిసిన వర్షపునీరు తోడు కావడంతో వరి పంట ఏటా నీట మునుగుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

చూపులే తప్ప.. చేతల్లేవు

వెంకటాయపాలెం, తాళ్లపూడి మండలం తిరుగుడు మెట్ట గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు ద్వారా నీరు వెళ్లకపోవడం కూడా ప్రధాన కారణంగా రైతులు పేర్కొంటున్నారు. కాలువ నీరు వచ్చినప్పుడల్లా పంట పొలాలకు ప్రభుత్వం నష్టం పరిహారం అందజేస్తామని చెబుతున్నారు తప్ప పరిహారం అందజేయడం లేదని రైతన్నలు తెలిపారు. చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లో వరి పంట వేసి నష్టపోయిన వారు కౌలు రైతులే ఎక్కువ మంది ఉన్నారు. అటు రైతులకు కౌలు ఇచ్చి వరి పంటకు పెట్టుబడి పెట్టి తీరా పంట చేతికి వచ్చే సమయానికి నష్టం వాటిల్లడంతో రైతులు తమ ఆవేదన ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. అధికారులు వస్తున్నారు, వెళ్తున్నారు తప్ప రైతులకు మేలు చేసే విధంగా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు.

కల్వర్టు నిర్మాణంతో నష్ట నివారణ



కొవ్వాడ కాలువ ఉధృతికి ఏటా నష్టం వాటిల్లుతుంది. వెంకటాయపాలెం, తిరుగుడుమెట్ట గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు ద్వారా నీరు వెనక్కి పోటెత్తడంతో తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అధికారులు కల్వర్టు నిర్మాణం చేపడితే కొంత మేర నష్టాన్ని తగ్గించవచ్చు.

– బొల్లా అన్నవరం, వెంకటాయపాలెం, వరి రైతు

కౌలు రైతులకు తీవ్ర నష్టం



చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాలలో ఉన్న భూములను కౌలుకు తీసుకొని వేసిన వరి పంట రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. సుమారు 15 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేయగా 10 ఎకరాలు వరి పూర్తిగా నీటమునిగి వరి కంకులు కనిపిస్తున్నాయి.

షేక్ మీరా వలీ, కౌలు రైతు, వెంకటాయపాలెం

క్లుప్తంగా

సంస్కృతీ సంప్రదాయాలు అలవరచుకోవాలి



అమ్మవారి వేషధారణలో విద్యార్థుల సందడి

పెరవలి: విద్యార్థి దశనుంచే చిన్నారులకు సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని తద్వారా వారికి మానసిక పరిపక్వత కలుగుతుందని ప్రిన్సిపాల్ ఓలేటి నారాయణ కుమార్ అన్నారు. పెరవలి వశిష్ట పాఠశాలలో సోమవారం దసరా సందర్భంగా విద్యార్థులతో వివిధ అమ్మవారి వేషధారణలు, బొమ్మల కొలువు, బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మన పూర్వీకులు మనకు అందించిన అనేక ఆచార, వ్యవహారాలను ప్రస్తుతం యువతరం పక్కన పెట్టారన్నారు. మన సంస్కృతులేమిటో విద్యార్థి దశ నుంచే పిల్లలకు అలవరచుకుంటే రాబోయే తరాలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

పెరవలి: మండలంలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు మెగా ఆధార్ క్యాంప్‌లను నాలుగు గ్రామాల్లో నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కె.ఉమా రాజ్యలక్ష్మీ పద్మజ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ ఉసులుమర్రు, పెరవలి, పిట్టల వేమవరం, ఖండవల్లి గ్రామాల్లో శిబిరాలను నిర్వహిస్తారని, వీటిలో ఆధార్ అప్డేట్, అడ్రస్ మార్పు, ఫోన్ నెంబర్ లింక్, పుట్టిన తేదీ మార్పులను చేయించుకోవచ్చని సూచించారు. ఈ కేంద్రాల పరిధిలో ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నిడదవోలు రూరల్: మండలంలోని మునిపల్లి, కాటకోటేశ్వరం గ్రామాల్లో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీఎస్‌వీఎల్ జగన్నాధరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆధార్‌లోని తప్పులను సవరించుకునేందుకు ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.


చాలీచాలని జీతాలతో బతికేదెలా.?



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నల్లజర్ల మండల వీఆర్‌ఏలు

నల్లజర్ల: కష్టానికి తగిన ప్రతిఫలం వీఆర్‌ఏలకు దక్కడం లేదని వీఆర్‌ఏలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ మేరకు వీఆర్‌ఏల సంఘ నాయకుడు సర్దార్ మాట్లాడుతూ పెరిగిన జీవన ప్రమాణాలు, నిత్యావసర ధరలతో చాలీచాలనీ జీతాలు సరిపోక బతుకు బండి నెట్టుకొస్తున్నామని వాపోయారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో రెండేళ్లలో ఇంటర్ పూర్తి చేస్తే వీఆర్‌ఓలుగా నేరుగా నియమిస్తామంటే దాదాపు 700 మందికి పదోన్నతి కల్పించారన్నారు. 2012, 2014లలో రెండు పర్యాయాలు వీఆర్‌ఓలకు నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు కల్పించారని, అప్పటి నుంచి మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, రవి, రాజు, ముంగమూరి కృష్ణ పాల్గొన్నారు.

ఏటి గట్టుపై కష్టాలు



కుమారదేవం వద్ద ఇసుక కోసం వచ్చిన లారీలు

తాళ్లపూడి(కొవ్వూరు): తాళ్లపూడి నుంచి కొవ్వూరు వెళ్తే ఏటీగట్టు రోడ్డుపై ఇసుక స్టాక్ పాయింట్లతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఈ పరిస్థితి కొనసాగుతోంది. 21న సాక్షిలో వచ్చిన ఉచితంగా దోపిడీ కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించి స్టాక్ పాయింట్లను పరిశీలించి నిబంధనలు పాటించాలని సూచించి చేతులు దులుపుకున్నారు. కాని ప్రస్తుతం లారీలు లేవని తెలపడం గమనార్హం. పైగా పాత ఫోటోలు అని పేర్కొన్నారు. లారీల రాకపోకలపై సోమవారం రాత్రి కొవ్వూరు తహసీల్దార్ దుర్గాప్రసాద్‌కు సమాచారం అందించగా ఇసుక లారీలు తిరగడం సహజమని చెప్పడంతో ప్రయాణికులు కంగుతిన్నారు. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

కరుణించవమ్మా.. కనక దుర్గమ్మా

- వైభవంగా దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు
- వాడవాడలా అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠాపన
- రెండో తేదీ వరకు ఉత్సవాల నిర్వహణ



దేవరపల్లిలో బాలదుర్గమ్మ అమ్మవారి ప్రతిమతో కమిటీ సభ్యులు



అన్నదేవరపేటలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: దేవీ శరన్నవరాత్రల మహోత్సవాలు దేవరపల్లి మండలంలో సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో వీధివీధినా మండపాలు ఏర్పాటు చేసి దుర్గాదేవి అమ్మవారి ప్రతిమలను ప్రతిష్ఠించారు. తొలి రోజు అమ్మవారిని బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో అలంకరణ చేసి భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. అక్టోబరు 2వ తేదీ వరకు దసరా ఉత్సవాలు జరుగనున్నాయి. దుర్గాదేవి ఆలయాలను ముస్తాబు చేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాల ప్రాంగణాలను తీర్చిదిద్దారు. దేవరపల్లిలో కొలువైన బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయం, మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికా ఆలయం, పల్లపు వీధి రామాలయం వద్ద గల దుర్గాదేవి ఆలయం, దుద్దుకూరులోని ముత్యాలమ్మ తల్లి అలయం, గౌరీపట్నంలోని కనక దుర్గాదేవి ఆలయం, పల్లంట్లలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, మండలంలోని పలు గ్రామాల్లోని దుర్గాదేవి అమ్మవారి ఆలయాల్లో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవరపల్లిలోని అమ్మవారి ఆలయాను ఎంపీపీ కేవీకే దుర్గారావు సందర్శించి పూజలు నిర్వహించారు.

స్వర్ణ దుర్గాశ్రమంలో నవరాత్ర మహోత్సవాలు

నల్లజర్ల: అనంతపల్లి శివారు సంజీవపురంలో సంజీవకొండపై శ్రీచక్ర సమేత స్వర్ణదుర్గా అమ్మవారి 85వ శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి ఆనంద నారాయణ భారతీ స్వామి ఆధ్వర్యంలో అఖండ దీపారాధన, కలశస్థాపన కార్యక్రమాలు జరిగాయి. అవిర్నీ రామచంద్రారావు, ఝాన్సీలక్ష్మి దంపతులతో కుంకుమపూజ, అభిషేకాలు చేపట్టారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారికి జలాభిషేకం

చాగల్లు: మండలంలో దేవి నవరాత్ర ఉత్సవాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. సోమవారం తెల్లవారుజాము నుంచే మహిళలు ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు. చాగల్లులో మాతంగి చెరువు గట్టుపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో కలశ పూజ, ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. చాగల్లు వాసవీమాత ఆలయం వద్ద 108 మంది మహిళలతో అమ్మవారికి జలాభిషేకం జరిపి ప్రత్యేక పూజ కార్యాక్రమాలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఊనగట్లలో బీసీ కాలనీలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఉత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి.

మాజీ ఎమ్మెల్యే తలారి పూజలు

తాళ్లపూడి: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్నదేవరపేటలోని వేగులమ్మ తల్లి ఆయం వద్ద జరుగుతున్న దేవీ శరన్నవరాత్ర వేడుకలు సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హాజరయ్యి పూజలు నిర్వహించారు.

పాడి రైతులకు నష్టపరిహారం అందించాలి



పాడి రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామంలో అంతుచిక్కని వ్యాధితో మృతి చెందిన గేదెలకు సంబంధించి పాడి రైతులకు ప్రభుత్వం తక్షణం నష్టపరిహారం అందజేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి తలారి వెంకట్రావు గ్రామంలో పర్యటించి పాడి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గత 20 రోజుల నుంచి గ్రామంలో మూగజీవాలు అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడుతుంటే ప్రభుత్వం ఇప్పటికి పూర్తి స్థాయిలో వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న వర్షకాలం అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే సమస్యను ప్రస్తావించకపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. పాడి పరిశ్రమనే జీవనంగా మలుచుకుని బ్రతుకుతున్న మధ్యతరగతి కుటుంబాలు పశువుల మృతితో తీవ్రంగా నష్టపోయారని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, రాష్ట్ర కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, నాయకులు తోట రామకృష్ణ, కవల నాగేశ్వరరావు, నామా ప్రకాశం, మైలవరపు రాధాకృష్ణ, సర్పంచ్లు కొమ్మిరెడ్డి పరశురామారావు, గండి రాంబాబు పాల్గొన్నారు.

పాడి రైతులకు మానవత సేవా సాయం

పెద్దేవం పంచాయతీ నందు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల గేదెలు మృత్యువాత పడడంతో బాధిత పాడిరైతు కుటుంబాలకు మానవత సంస్థ ద్వారా సాయాన్ని అందజేశారు. నిత్యవసర సరుకులు, మందులు రూ.మూడువేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు గెద్దం సాయిబాబా, గ్రామ సర్పంచ్ వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, మానవత రీజనల్ ఛైర్మన్ వి.చంద్రయ్య, అప్పన హనుమంతరావు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని అటకెక్కించిన కూటమి



మల్లవరంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు

చాగల్లు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ప్రభుత్వం ఎన్నో మెలికలు పెట్టిందని అధికారంలోకి వచ్చాక 15 నెలల తరువాత అమలు చేస్తున్న ఈ పథకంలో అన్ని బస్సుల్లో ఉచితం కాదు. కొన్ని బస్సుల్లో మాత్రమేనని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని సోమవారం మల్లవరం గ్రామంలో నిర్వహించారు. ఈ సభలో చంద్రబాబు 15 నెలల పాలనలో అరాచకాలు, మోసాలను స్థానిక నాయకులతో కలిసి వివరించారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లులు ఉంటే 54 లక్షల మందికి మాత్రమే ఈ పథకం ఇచ్చారన్నారు. వైద్యం, వ్యవసాయ రంగాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఆరోగ్యశ్రీని అటకెక్కించిందని. రైతన్నలకు పెట్టుబడి సాయం అందించకుండా అప్పుల పాలు చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లకంసాని సూర్యప్రకాశరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, చాగల్లు మండల పార్టీ అధ్యక్షులు, మట్టా వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, పార్టీ సినీయర్ నాయకులు తోట రామకృష్ణ, పార్టీ జిల్లా ఆర్‌టీఏ విభాగం అధ్యక్షులు ఇంటి వీర్రాజు, నందిగంపాడు సర్పంచ్ కుదప రాంబాబు, గేడా శ్యామ్,తాళ్లూరి సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా..ఇల్లు జాగ్రత్త

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన పలు దొంగతనాల నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలకు పోలీసులు సోమవారం కీలక సూచనలు చేశారు. దసరా సెలవుల సందర్భంగ ఇల్లుకు తాళాలు వేసి ఊర్లకు వెళ్తే పోలీసులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు సూచించారు. ఇరుగుపొరుగు వారిని ఇంటిని ఓ కంట కనిపెట్టమని చెప్పాలని, విలువైన బంగారం, వెండి ఆభరణాలు, డబ్బును బ్యాంకు లాకర్లో పెట్టి భద్రపరుచుకోవాలన్నారు. ఇంటి తాళాలు లోపల వేసుకోవాలని ఆయన సూచించారు.

రూ.30 లక్షలకు మోసం చేశారని ఫిర్యాదు

తాళ్లపూడి (కొవ్వూరు): తనను ఓ వ్యక్తి సుమారు రూ.30 లక్షల మేర మోసం చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొవ్వూరు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు కథనం ప్రకారం.. కుమారదేవం గ్రామంలోని ఓపెన్ రీచ్ స్టాక్ పాయింట్ నుంచి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ అవసరాలకు గాను విశాఖ, అనకాపల్లి జిల్లాలకు దుర్గా వెంకటరమణ శాండ్ ట్రేడర్స్ ద్వారా గుడపాటి రాజశేఖర్ సరఫరా చేస్తున్నారు. ఆ స్టాక్ పాయింట్ వద్ద భీమవరం పట్టణానికి చెందిన కునుపూడి శ్రీనివాస్ అలియాస్ చిరుత శ్రీనివాస్‌ను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు గుమస్తాగా నియమించారు. అతడు తన అల్లుడైన పంపన గణపతిని రాజశేఖర్‌కు పరిచయం చేశారు. తనకు లారీ ఉందని చెప్పారు. ప్రతి రోజూ స్టాక్ పాయింటును సాయంత్రం 6 గంటలకు మూసివేస్తారు. ఆ తరువాత శ్రీనివాస్, అతడి అల్లుడు గణపతి ఆ స్టాక్ పాయింట్ నుంచి రూ.6,47,882 విలువైన 196 ట్రిప్పుల ఇసుకను తరలించి, తనను మోసగించారని రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా లారీతో ఇసుక రవాణా చేయడానికి గాను రూ.8 లక్షల అడ్వాన్సు తీసుకున్నారని, గణపతి తన కుటుంబ అవసరాలకు గాను తమ లారీని దస్తావేజు అగ్రిమెంట్ చేసుకుని తన వద్ద రూ.15 లక్షలు తీసుకున్నారని పేర్కొన్నారు. అయితే, లారీని తనకు అప్పగించినప్పటికీ తన పేరిట రిజిస్ట్రేషన్ చేయలేదని, రాత్రి వేళ ఆ లారీ తీసుకుని వెళ్లి, నవాబుపాలెంలో ఉంచారని తెలిపారు. మొత్తమ్మీద తనను సుమారు రూ.30 లక్షల మేర మోసగించారని రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలి

పెరవలి: గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో పౌష్టికాహారం లోపం వలన అనేక రుగ్మతలు తలెత్తుతాయని పెరవలి పీహెచ్‌సీ వైద్యురాలు తేజశ్రీ తెలిపారు. పెరవలి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహాన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకుంటే పిల్లలు, తల్లుల్లో ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవన్నారు.

నిడదవోలు రూరల్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.ఆశారోహిణి అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం అంగన్‌వాడీ కేంద్రం 3లో రాష్ట్రీయ పోషణ మాసం అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని వివరించారు.

విధులకు అధికారుల డుమ్మా

పెరవలి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కారవేదికపై మండల అధికారులకు సమయస్ఫూర్తి లేకపోవడం, మరికొందరు అధికారులు డుమ్మా కొట్టటంతో వెలవెలబోయింది. మండల స్థాయి అధికారులు సమయానికి రాకపోవటంతో దిగువశ్రేణి అధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీలు అందిచడానికి వచ్చిన బాధితులు ఫిర్యాదుని ఎవరికి ఇవ్వాలో తెలియక ఇబ్బందులు పడ్డారు. తహసీల్దార్ 10.45కి రాగా, ఎంపీడీఓ 10.55కి వచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉదయం 10 గంటలకు ప్రారంభమవ్వవలసి ఉండగా అధికారులు లేకపోవటంతో వచ్చిన ఫిర్యాదు దారులు దిక్కులు చూస్తూ కాలక్షేపం చేశారు. దీంతో పీజీఆర్‌ఎస్‌ను ఫిర్యాదుదారులు చులకనగా చూస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులే బాధ్యత వహించాలి

తాళ్లపూడి(కొవ్వూరు): మీ కోసంలో నమోదు అయిన ఫిర్యాదులను నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'పీజీఆర్‌ఎస్–మీ కోసం' వేదికలో వచ్చిన అర్జీలను డివిజన్ పరిధిలోని అధికారులతో కలిసి ఆర్డీవో స్వీకరించారు. ఈ మేరకు ఆర్డీవో మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కరం కోరుతూ 9 అర్జీలు వచ్చాయని తెలిపారు. అర్జీల పరిష్కారంలో ఏదైనా జాప్యం జరిగితే సంబంధిత జిల్లా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ



ఎంపీపీ దుర్గారావును కలిసిన ఎంపీడీఓ నాగార్జునరావు

దేవరపల్లి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సీహెచ్ నాగార్జునరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో ఈఓపీఆర్డీగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను పంచాయతీ, గ్రామ సచివాలయాల కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఎంపీపీ కేవీకే దుర్గారావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తానని ఆయన వివరించారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

నిడదవోలు: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికి మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు హర్షవర్ధన్, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు, మునిసిపల్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నల్లజర్ల: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టరు ఎండీ.సిరాజుద్దీన్ సూచించారు. సోమవారం పడమర చోడవరంలో సర్పంచ్ పెండ్యాల హిమబిందు అధ్యక్షతన 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించడమే ధ్యేయంగా అందరు కృషి చేయాలన్నారు. గర్భిణులకు వైద్యపరీక్షలు చేసి ఐరన్ టాబ్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం గీత, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో వస్తువులను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

చాగల్లు: వినియోగదారులకు వస్తువులను ఎమ్ఆర్పీ ధరలు కన్నా అధికంగా విక్రయిస్తే సదరు దుకాణదారుడిపై చట్టారిత్యా కేసు నమోదు చేస్తామని కొవ్వూరు డివిజన్ తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ జివి ప్రసాద్ తెలిపారు. సోమవారం చాగల్లు, నిడదవోలు, కొవ్వూరు ప్రాంతాల్లో పలు దుకాణాలు, సూపర్ బజార్లు తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. వ్యాపారులు తగ్గిన జీఎస్టీ శ్లాబ్‌కు అనుగుణంగా వినియోగదారులకు సరుకులు అమ్మకాలు చేయాలని సూచించారు. కాటాలకు సీల్ లేకుండా అమ్మకాలు జరిపిన వ్యాపారులపై మొత్తం 48 కేసులు నమోదు చేసినట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వమే వైద్య కళాశాలలను నడపాలి

నిడదవోలు: రాష్ట్రానికి నూతనంగా మంజూరైన మెడికల్ కాలేజీలను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) కిందికి తీసుకొస్తూ కూటమి ప్రభుత్వం చేసిన నిర్ణయం సరికాదని సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు అన్నారు. వైద్య విద్యనభ్యసించాలనే పేద మధ్య తరగతి యువతకు, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు పొందే వారికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ విధానానికి ప్రభుత్వం స్వస్తి చెప్పి ప్రభుత్వమే వైద్య కళాశాలను నడపాలన్నారు. లోక్ సభ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న నీతి ఆయోగ్ నిర్దేశం మేరకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏపీకి 17 వైద్య కళాశాలలను కేంద్ర ప్రభుత్వం నుంచి లాంఛనప్రాయంగా అనుమతులు వచ్చాయన్నారు.